


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

గురువారం 16 అక్టోబర్ 2025 పేజీలు 06




## వరి ధాన్యం సేకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

●రాష్ట్రంలో ఖరీఫ్ 2025 - 26 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాటు చేయాలి ● 148 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చే అవకాశం ● 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యాన్నికొనుగోలు చేయడం జరుగుతుంది ● రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు ●వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర ● రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** 2025-26 ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం సేకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాలు, వ్యవసాయ, రవాణా, ఎఫ్.సి.ఐ. శాఖల కమిషనర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ, రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ 2025 - 26 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాటు చేయాలని తెలిపారు. వానాకాలంలో 66 లక్షల 80 వేల ఎకరాలలో ప్రతిపాదిత వరి సాగు జరిగిందని, దాదాపు 148 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర, సన్న రకం వడ్ల బోనస్, కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే సమయంలో లోతట్టు ప్రాంతాలలో ఉండకుండా చూసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో ( మిగితా...2లో )

## ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

**- రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**



**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** 2025-26 ఖరీఫ్ సంబంధిత వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాలు, వ్యవసాయ, రవాణా, ఎఫ్. సి. ఐ. శాఖల కమిషనర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ, రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ 2025 - 26 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనం సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ( మిగితా...2లో )

## మారుమూల గ్రామాలలో సెల్ సిగ్నల్ సేవలను విస్తరించాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

2లో



## పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

2లో



## నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :** ప్రభుత్వం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట లో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం గుడి పేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు 216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
గురువారం 16 అక్టోబర్ 2025

## వరి ధాన్యం సేకరణ ప్రక్రియ
# పకడ్బందీగా నిర్వహించాలి

**- రాష్ట్రంలో ఖరీఫ్ 2025 - 26 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాటు చేయాలి- 148 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చే అవకాశం - 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుంది- రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు - వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర - రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**మొదటి పేజీ తరువాయి....**

త్రాగునీరు, నీడ ఇతర కనీస వసతులు కల్పించాలని, అవసరమైన గన్ని సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, సరిపడా హమాలీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకం వరి ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేసి నిబంధనల ప్రకారం వేరు వేరు గన్నీ సంచులలో సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. ప్యాడి క్లీనర్లు, తేమ శాతం పరికరాలు, హస్క్ రిమూవర్ లు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచాలని, తూనికలు కొలతల శాఖ అధికారులతో ధ్రువీకరించుకోవాలని తెలిపారు. వరి ధాన్యం తరలింపుకు అవసరమైన గన్నీ సంచులు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారుల ఆధ్వర్యంలో హార్వెస్టర్ వాహనంలో బ్లోయర్ యాక్టివ్ మోడ్ లో ఉండి ఆర్.పి.ఎం. 18- 20 ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్ల నుండి సి.ఎం.ఆర్. కు సంబంధించిన బ్యాంకు గ్యారంటీలు, ఒప్పందాలు సిద్ధం చేసుకోవాలని, కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రైతులకు కొనుగోలు సమయంలో తలెత్తే ఇబ్బందులపై ఫిర్యాదులు స్వీకరించాలని, హెల్ప్ లైన్ నెంబర్ ను ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్రదర్శించాలని తెలిపారు. వాతావరణ సూచనలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలకు దాన్యం తడవకుండా టార్పాలిన్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలకు వెంటనే స్పందించాలని, రిజైండర్లు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా అన్ని శాఖల సహకారంతో వరి ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడం జరుగుతుందని, కనీస మద్దతు ధర చెల్లించి రైతులకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని, గన్ని సంచులు, టార్పాలిన్లు, రవాణా తదితర సౌకర్యాలు కల్పించాలని, పత్తి, మొక్కజొన్న, సోయా సాగు చేసిన రైతులకు కూడా కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.




జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల మేరకు దాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు నిర్ణీత వ్యవధిలో చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

### మారుమూల గ్రామాలలో
## సెల్ సిగ్నల్ సేవలను విస్తరించాలి
### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్:**

జిల్లాలోని మారుమూల గ్రామాలలో సెల్ సిగ్నల్ సేవలను విస్తరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో భారత్ సంచార నిగం లిమిటెడ్, జియో, ఎయిర్ టెల్ సంస్థల ప్రతినిధులతో సెల్ టవర్ల ఏర్పాటు, సిగ్నల్స్ విస్తరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మారుమూల ప్రాంతాలకు సిగ్నల్స్ అందే విధంగా సేవలను విస్తరించాలని, చాలా గ్రామాలలో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని తెలుపుతూ ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, చేయూత పింఛన్లు, సన్న బియ్యం కార్యక్రమాలు సిగ్నల్స్ తో ముడిపడి ఉన్నాయని, పూర్తి స్థాయిలో సేవలు అందించేందుకు సిగ్నల్స్ సామర్థ్యాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రేట్ పర్యవేక్షకులు శశిధర్, బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి
### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్:**

జిల్లాలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశపూర్ గ్రామంలో పశు వైద్య ఉపకేంద్రంలో పశు వైద్య - ప్రస్తుత సంపర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమానికి అధికారులతో కలిసి హాజరై పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల యజమానులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, ఏ ఒక్క పశువు మిగలకుండా టీకాలు వేయించాలని తెలిపారు. పాడి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు కురిసినందున పశువులు వ్యాధులకు గురయ్యాయని, గాలికుంటు వ్యాధి అంటూ వ్యాధి లాంటిదని, ప్రతి ఒక్కరూ తమ పశువులకు టీకాలు వేసుకోవాలని తెలిపారు. పశువుల యజమానులు తమ పశు వైద్యాధికారుల చరవాణి నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం యజమానులకు పశువులకు బలాన్ని అందించే మల్టీ మిక్స్ పౌడర్ ప్యాకెట్లను అందజేశారు. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య - పశుసంవర్ధక శాఖ అధికారి డా. సురేష్ కుమార్, వైద్యులు, పశువుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.




---

# ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి
### - రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2025- 26 సీజన్ లో 44 వేల మెట్రిక్ టన్నుల వరిదాన్ని దిగుబడి వచ్చే అవకాశం ఉందని, జిల్లాలో 40 కొనుగోలు కేంద్రాలు (ఐ కె పి ఆధ్వర్యంలో 22, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 18) ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 24వ తేదీలోగా అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దాదాపు 30 వేల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, గన్ని సంచులు, ప్యాడి క్లీనింగ్ యంత్రాలు, డ్రయర్స్, తేమ యంత్రం, టాబ్ మిషన్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. హార్వెస్టర్ వాహనాల యజమానులతో సమావేశం నిర్వహించి, వ్యవసాయ శాఖ, కేంద్రాల నిర్వహకులకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో వరి కొనుగోలు కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తరావు, పౌరసరఫరాల శాఖ అధికారులు స్వామి, సాదిక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# జిల్లాలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించాలి
### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**

జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో జిల్లాలోని పశువులకు టీకాలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, ఇతర అధికారులతో కలిసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల సంబంధిత గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి నవంబర్ 14వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించడం జరుగుతుందని, 4 నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకాలు అందించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు సంరక్షణలో భాగంగా ఈ



కార్యక్రమం చేపట్టడం జరిగిందని, 2 లక్షల 42 వేల పశువులకు టీకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 35 బృందాల ద్వారా 94 మంది పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు టీకాలను అందిస్తారని తెలిపారు. వ్యాధి కారణంగా పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని, పునరుత్పత్తి, పని సామర్థ్యం తగ్గడంతో పాడి రైతులకు నష్టం జరుగుతుందని, దీనిని నివారించేందుకు ప్రతి పశువుకు టీకాలు అందించాలని తెలిపారు. టీకాలు వేసిన ప్రతి పశువుకు గుర్తింపు చెవిపోగు వేసి వివరాలను భారత్ పశుధన్ యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. గ్రామ పెద్దలు, రైతులు తమ పశువులకు టీకాలు వేయించి వాటి సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com

# గుండె నొప్పి వస్తే పి.ఆర్ విధానం పై అవగవన

ఇచ్చోడ సూర్య మేజర్ న్యూస్

ఇచ్చోడ ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆదేశాలతో ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తలమద్రి పరిధిలోని పట్వారీ గూడ గ్రామంలో అవగాహన కల్పించారు. బుధవారం రోజున జనహిత సేవా సంస్థ సభ్యులకు సి పి ఆర్



పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 తేదీ నుండి 17 వ తేదీ వరకు సి పి ఆర్ పై అవగాహన సదస్సులు జరుగుతున్నాయి. సి పి ఆర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని తెలియజేయడం జరిగింది. ఛాతీ నొప్పి వస్తె ఎలా రెస్క్యూ బ్రీతింగ్ సి పి ఆర్ ఏ విధంగా చేయాలో చేసి చూపించడం జరిగింది గడిచిన కొన్ని సంవత్సరాల నుంచి చాలామంది గుండె జబ్బులు బారిన పడుతున్నారు ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగిన వారికి సిపిఆర్ చాలా కీలకంగా ఉంటుంది సిపిఆర్ చేసినట్లయితే అటువంటి వారు తొందరగా కోలుకుని అవకాశం ఉంటుందని ఇచ్చోడ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బ్రహ్మానంద రెడ్డి ఆరోగ్య కార్యకర్త సుభాష్ జనహిత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, కార్యదర్శి రమేష్ ఉపాధ్యక్షులు బోడ్డు భోజన్న, లక్ష్మారెడ్డి, గట్ల నర్సయ్య, కార్యవర్గ సభ్యులందరూ పాల్గొన్నారు.

## నాలుగో తరగతి ఉద్యోగులకు మద్దతుగా

# భారతీయ జనతా పార్టీ

## - నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్

నిర్మల్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు ఉట్నూర్ ఐటీడీఏ ఎదురుగా నిరసన ధర్నా చేస్తున్న ఆశ్రమ పాఠశాల నాలుగో తరగతి ఉద్యోగులకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు తన నిరసన చేసుకునే హక్కు



ఉందని ఉట్నూర్ ఐటీడీఏ పిఓ మేడం 220 మంది ఉద్యోగులను తొలగించడం చాలా దారుణం అని తీవ్రంగా ఖండిస్తున్నాం అంటూ చెప్పడం జరిగింది.. వారి న్యాయమైన కోరికలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపాల్సిన బాధ్యత పిఓ ఐటిడిఏ పై బాధ్యత ఉందంటూ చెప్పడం జరిగింది ఈ ధర్నాలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి భారతీయ జనతా పార్టీ మద్దతుగా ఉంటుందని తెలుపుతూ మాట్లాడడం జరిగింది.. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షుడు బింగి వెంకటేష్ రాష్ట్ర మహిళా మోర్చా మెంబర్ జాదవ్ సుమన్ బాయి జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, రాథోడ్ శేషారావు, సాడిగే రాజేశ్వర్, ఉస్కమొల్ల దేవిదాస్, పొన్నం జగన్ పటేల్ కిషన్ పాటిల్, కనక విజయ్ జాదవ్ రవి, మహాత్మే మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో అప్రకటిత విద్యుత్తు కోతలు

# ఇబ్బంది పడుతున్న కాగజ్నగర్ ప్రజలు

కాగజ్నగర్, అక్టోబర్15, సూర్య మేజర్ న్యూస్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ పట్టణంలో గత కొద్ది రోజులుగా విద్యుత్తు అధికారులు ఎలాంటి ముందస్తు ప్రకటన (సమాచారం) చేయకుండా ఇష్టారీతిన కరెంటు కోతలు విధిస్తున్నారు. దీంతో పట్టణవాసులు ముఖ్యంగా కరెంటు పై ఆధారపడి జీవించే వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో , ఎప్పుడు ఎందుకు పోతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ప్రజలు విద్యుత్తు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్తు అధికారులు పట్టణంలో ఏ టైం లో ఏ ఏరియాలో కరెంటు కోతలు విధించ బడతాయో ముందస్తు సమాచారం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళ

## -5 మండలాల యువత, ప్రజలు ఈ నెల 18 వరకు వివరాలను పోలీస్ స్టేషన్ నందు నమోదు చేసుకోవాలి
## -ఆధార్ కార్డు, టెన్త్ క్లాస్ మెమో లేదా అడ్రస్ ప్రూఫ్ జిరాక్సును పోలీస్ స్టేషన్ నందు అందజేయాలి
## -ఆన్లైన్ లేదా మీసేవ సెంటర్లలో రుసుములు చెల్లించాలి
## -ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్



ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్

ఆదిలాబాద్ జిల్లాలో నిరుపేద యువతీ, యువకులు, ప్రజలు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహన నియమ నిబంధనలు పాటించడానికి ప్రత్యేకంగా జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మొదటి విడత 5 మండలాలలో మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు, ఈ సందర్భంగా 5 మండలాలు నార్నూర్, గాదిగూడ, బజార్హత్నూర్, సిరికొండ, బీంపూర్ లలో యువత, ప్రజలు తమ యొక్క ఆధార్ కార్డు మరియు అడ్రస్ ప్రూఫ్ లేదా టెన్త్ క్లాస్ మెమో జిరాక్సులను సంబంధిత పోలీసు స్టేషన్ల నందు అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వీరూ మొదటగా ఆన్లైన్ నందు లేదా మీసేవ కేంద్రాల్లో లర్నింగ్ లైసెన్స్ కై 600 రూపాయల రుసుము చెల్లించవలసిందిగా ఉంటుందని, తదుపరి లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చిన తర్వాత నెల రోజుల నుండి ఆరు నెలల లోపు పర్మినెంట్ లైసెన్స్ కొరకు 1200 రూపాయల రుసుమును ప్రభుత్వానికి చెల్లించవలసింది ఉంటుందని తెలిపారు. ఈ మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళా ను ప్రజలు, యువత పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈనెల 18వ తారీకు వరకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యువత ప్రజలు వాహన నియమనిబంధనలు పాటించాలని ప్రమాదాలకు గురి కాకుండా లైసెన్సులు నియమాలు ఉపయోగపడతాయని సూచించారు.

## ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలి...

# అల్లేపు పీటర్ ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి

ఖానాపూర్ టౌన్ అక్టోబర్ 15 సూర్య మేజర్ న్యూస్

ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి అల్లేపు పీటర్ ఒక ప్రకటనలో తెలిపినారు. ఉద్యోగులు కార్యాలయాలకు సకాలంలో రాకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొంతమంది ఉద్యోగులు ఉద్యోగ బాధ్యత నిర్వర్తించకుండా బయట తిరుగు తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. కొన్ని ఉద్యోగాలకు టూర్డైరీ ఉంటుందని, వారు టూర్ డైరీ ప్రకారం విధులు నిర్వర్తించడం లేదని అన్నారు. ఉద్యోగులు విధులకు సకాలంలో హాజరు కాకున్నా, విధులు సక్రమంగా నిర్వ హించకున్న పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



## ఉద్యాన పంటలను సందర్శించిన జిల్లా అధికారులు

లక్షెట్టిపేట, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:

మండలంలోని సూరారం గ్రామంలో రైతులు సాగుచేస్తున్న కూరగాయలు తోటలు,పండ్ల తోటలు సందర్శించారు. వంకాయ, గులాబీ, మల్లె పంటలపై క్షేత్రాన్ని సందర్శించి పంటలో వచ్చే మెలకువలు సస్యరక్షణ తోటల్లో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై ఉద్యాన శాఖ అధికారిని కె. సహజ రైతులు వివిధ కూరగాయల్లో చీడపీడల్లో సస్యరక్షణ చర్యలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం మంచిర్యాల జిల్లా ఉద్యాన పంటల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీల వివరాలను రైతులకు వివరించి చెప్పారు. ఉద్యాన విస్తరణ అధికారి ఆదెపు శేఖర్, రైతులు రాజు, మల్లేష్, హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.



# పశువులకు తప్పకుండ టీకాలను వేయించాలి

దస్తురాబాద్, అక్టోబర్ 15 సూర్య మేజర్ న్యూస్

రైతులు, పశు యజమానులు తప్పనిసరిగా పశువులకు గాలి కుంటూ టీకాలను వేయించాలని వెటర్నరీ డాక్టర్ సంధ్యారాణి సూచించారు. మండలంలోని దేవునిగూడెం గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల క్యాంపును పశు వైద్య అధికారులు ఏర్పాటు చేశారు. పశువులకు టీకాలు వేసి క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి పాడి రైతు తమ పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఉచిత గాలికుంటూ వ్యాధి టీకాల క్యాంపు సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమం లో వెటర్నరీ అసిస్టెంట్ దేవదాస్, సిబ్బంది మనోజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ రోజు కన్నా ముందుగానే మెడికల్ కార్డు

శ్రీరాంపూర్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వారు పదవీ విరమణ పొందుతున్న రోజు కన్న ముందుగా మెడికల్ కార్డును అందచేయాలని డైరెక్టర్ పా గౌతమ్ పోట్రు ఆదేశించడం జరిగింది. శ్రీరాంపూర్ ఏరియాలో 31 అక్టోబర్ 2025 రోజున 6గురు ఉద్యోగులు పదవీ విరమణ పొందడం



జరుగుతుంది. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ కార్డును అందజేయడానికి కావలసిన అన్ని డాక్యుమెంటులను ఆయా గనుల విభాగాల నుండి త్వరగా తెప్పించుకొని క్లైములను ప్రాసెస్ చేసి కార్పొరేట్ నుండి మెడికల్ కార్డులను పదవీ విరమణ కన్నా ముందుగానే తెప్పించినందుకు గాను శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ డిపార్ట్మెంట్ ఉద్యోగి స్వామి కి జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ప్రోత్సాహక బహుమతి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, స్వామి ని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగులందరూ వారికి కేటాయించిన విధులను సకాలంలో పూర్తిచేసి సంస్థ పురోగతిలో తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ ఎస్. అనిల్ కుమార్, టింబర్ యార్డ్ ఇన్చార్జ్ రాజేశ్వర్, డివై పిఎం లు శ్రీ రాజేష్, కిరణ్ కుమార్, సీనియర్ పిఓ లు పి. కాంతారావు, మురళి, సురేందర్ పర్సనల్ విభాగ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ కు కలాం

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్

రామకృష్ణాపూర్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్

లీడ్ ఇండియా వారి ఆధ్వర్యంలో బుధవారం మన ప్రియతమ మాజీ రాష్ట్రపతి భారతదేశ సైన్స్ పితా మహుడు అబ్దుల్ కలాం 94వ జన్మదిన సందర్భంగా హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో కలాం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ అవార్డ్ కు మన రామకృష్ణాపూర్ పట్టణంలో గత 25 సంవత్సరాల నుంచి విద్యా రంగంలో చేసిన నిస్వార్ధ సేవలకు గాను తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఎంపిక కావడం జరిగింది. ఈ అవార్డ్ బుధవారం మన తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మాజీ చేతుల మీదుగా అబ్దుల్ అజీజ్ కు ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా తవక్కల్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు అబ్దుల్ అజీజ్ కు శుభాకాంక్షలు తెలియచేశారు.



# కబ్జాకు గురవుతున్న సింగరేణి స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించండి

## - బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ డిమాండ్.



**బెల్లంపల్లి, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:** బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మందమర్రి జనరల్ మేనేజర్ రాధాకృష్ణ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో 1928 వ సంవత్సరంలో బొగ్గు గనులు ప్రారంభించడం జరిగింది. బెల్లంపల్లి పట్టణంలో అనేక బొగ్గు గనులతో కార్మిక బస్తీలతో నిండు పున్నమి చంద్రుల పట్నం వికసించేదని సింగరేణి కంపెనీకి 80 సంవత్సరాలుగా సిరులు అందించిన బెల్లంపల్లి పట్టణంలో బజార్ ఏరియా కు సౌత్ కలస్టర్ బొగ్గు గని నడిపించిందని ఈ గణికి ఆనుకొని క్యాంటీన్ ఎస్ఎంపి ఆఫీస్, కోల్ శాంపిల్‌ఆఫీస్, సివిల్ డిపార్ట్మెంట్, ల్యాంప్ క్యాబిన్ కార్యాలయం కూడా ఉండేవి అని కన్యకా పరమేశ్వరి దేవాలయము, పద్మశాలి ఫంక్షన్ హాలు స్థలంలో సివిల్ డిపార్ట్మెంట్ కాంట్రాక్టు క్యాజువల్ వర్కర్స్ ను డిస్ట్రిబ్యూషన్ చేసే ఆఫీస్ మరియు సిమెంట్ పోల్స్ సిమెంట్ ఇటుకలు ఈ స్థలంలో తయారు చేసే వారనీ, సింగరేణి అధికారులు గతంలో పనిచేసిన వారు ఇట్టి స్థలాన్ని రెండు దేవాలయాలకు ఇవ్వడం జరిగిందని, పద్మశాలి భవన్ లో ఇప్పటికీ సింగరేణి యాజమాన్యం ఇచ్చిన స్థలం కాంపౌండ్ వాల్ లోపల ఇంకా ఖాళీ స్థలం ఉన్నప్పటికీ కాంపౌండ్ అవతలి స్థలాన్ని దురుద్దేశంతో కబ్జా చేసే గురించి కాంపౌండ్ వాల్ అవతల దేవుని విగ్రహాలు పెట్టి దేవుని పేరిట పూజలు చేయడం అంటేనే ఖాళీ స్థలాన్ని కబ్జా చేయడం సమంజసంగా లేదని మసీదుకు ఇచ్చిన స్థలం కాకుండా పక్కన ఉన్న స్థలాన్ని కబ్జా చేస్తు నిర్మాణం చేస్తున్నారని ఇది కూడా సమంజసంగ లేదని ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం సింగరేణి అధికారులు వాస్తవ పరుస్తున్న అర్థం చేసుకొని ఎమ్మెల్యే వినోద్.. పై వాస్తవాలను అర్థం చేసుకొని వాటి స్థలాన్ని కాళీ చేయించడానికి సింగరేణి యాజమాన్యానికి సహకరించాలీ తప్ప కబ్జాదారును ప్రోత్సహించడం ఏమాత్రం భాగ్యం కాదని, సీ అండ్ ఎండి సింగరేణి వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే కొన్ని సంవత్సరాల క్రితం ఉత్పత్తి ఉత్పాదకత అవసరాల రీత్యా ఏర్పాటు చేసిన ఎక్స్ప్లోరేషన్, డిజిజన్ ఆఫీస్, ఏజెంటు ఆఫీస్, వర్క్ షాప్, పవరాజ్, ఓల్డ్ సీఎస్పీ, మహమ్మద్ హుస్సేన్ సెట్ టింబర్ యార్డ్, ఓల్డ్ జీఎం ఆఫీస్, టింబర్ డిపార్ట్మెంట్ ఆఫీసులో ఉన్నవి ఈ భూములను కాపాడాలని సింగరేణి ఉన్నత యాజమాన్యానికి బెల్లంపల్లి ప్రాంతంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రజలకు ఇట్టి భూములను సింగరేణి స్థలాలను కబ్జా కోరుల నుండి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. పద్మశాలి భవన్ ముందు నిర్మించిన అక్రమ కట్టడాలను, మసీదు పేరుతో ఆనుకొని ఉన్న స్థలాన్ని కబ్జా చేయడం నిలిపివేయాలని కోరుతున్నాం. పద్మశాలి భవన్ కాంపౌండ్ వాల్ కు నిర్మించిన రెండు గేట్లను తొలగించి అట్టి స్థలంలో గోడలు నిర్మించాలని కబ్జాకు గురవుతున్న స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించగలరని సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ సభ్యులు చిప్ప నరసయ్య సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, దాగాం మల్లేష్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆడెపు రాజమౌళి సిపిఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి, బొల్లం తిలక్ అంబేద్కర్ సిపిఐ బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి, సబ్బని రాజేంద్రప్రసాద్ ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి, గెల్లి రాయలింగు కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్, గెల్లి జయరాం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎండి అఫ్జల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, రత్నంరాజం, దేవసాని ఆనంద్, ఆడెపు మహేష్, పసులేటి వెంకటేష్ ఎంసీపీఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని

# విధులకు హాజరు కావాలి

## - ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

**ఉట్నూర్ ,అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్ :** విద్యార్థుల సంక్షేమం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విధులకు హాజరు కావాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ వసతి



గృహాలలో పార్ట్ టైం/ దినసరి వేతనంతో పని చేస్తున్న 220 మంది సమ్మెలో పాల్గొన్న నేపథ్యంలో వారి 3 నెలల వేతనాన్ని వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. దసరా సెలవుల అనంతరం ఈ నెల 4వ తేదీన పాఠశాలలు పున:ప్రారంభం అయినందున సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో విద్యార్థులకు వంట, పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమ దృష్ట్యా తాత్కాలికంగా బయట వ్యక్తులు పని చేయడం జరుగుతుందని తెలిపారు. కొంతమంది కార్మికులకు తమ జీతాలు చెల్లించిన తర్వాత కూడా ముందస్తు అనుమతి లేకుండా, ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం అందించకుండా సమ్మెలో కొనసాగుతున్నారని, సిబ్బంది విధుల నుండి తొలగింపబడలేదని, ముందస్తు అనుమతి తీసుకోకుండా విధులలోకి అనుమతించవద్దని మాత్రమే తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలలోని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నందున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అనుమతి తీసుకుని విధులకు హాజరు కావాలని తెలిపారు.

## నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ టెక్నికల్ అఫీషియల్ గా సంతోష్



**బెల్లంపల్లి, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:** బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పీ.ఈ.టి గా విధులు నిర్వర్తిస్తున్న సల్వాల సంతోష్ యాదవ్ హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో అక్టోబర్ 16 నుండి 18 వరకు జరగనున్న 5వ ఇండియన్ ఓపెన్ అండర్ 23 నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు టెక్నికల్ అఫీషియల్ గా నియమితులైనారు. ఈ విషయాన్ని తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి మంచిర్యాల జిల్లా కార్యదర్శి ఈ.మారయ్య తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు టెక్నికల్ అఫీషియల్ గా సంతోష్ నియామకం పట్ల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రవి ప్రసాద్ ప్రధానోపాధ్యాయులు రాజా రమేష్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, బెల్లంపల్లి పట్టణ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## రైతులు పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

**కడెం, అక్టోబర్ 15,సూర్య మేజర్ న్యూస్ :** గ్రామాల్లో నిర్వహించే ఉచిత గాలికుంటు టీకాల శిబిరాన్ని రైతులు, పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కడెం మండల పశువైద్యాధికారి డాక్టర్ సౌందర్య సూచించారు. బుధవారం కడెం మండలం పెద్దూరు గ్రామంలో ఉచిత గాలికుంటు టీకాల శిబిరాన్ని నిర్వహించి గ్రామంలోని పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యురాలు సౌందర్య మాట్లాడుతూ ఈరోజు నుండి నెల రోజుల పాటు కడెం మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు ఉచిత గాలికుంటు టీకాల శిబిరం నిర్వహించి పశు వైద్య సిబ్బంది టీకాలు వేస్తారని రైతులు వారి వారి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని కోరారు. పశువుల మెరుగైన ఆరోగ్యానికి రైతులు పశు వైద్య సిబ్బందికి సహకరించి గాలికుంటు టీకాలు వేయించాలన్నారు. పశువులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే మండల పశు వైద్య అధికారులను లేదా సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రణదివ్యా నగర్ లో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం

**- 60 ద్విచక్ర వాహనాలు, 32 ఆటోలు,2 ట్రాక్టర్స్ స్వాధీనం.- అక్రమంగా అమ్ముతున్నటువంటి 16 లీటర్ల మద్యం స్వాధీనం - 100 మంది సిబ్బందితో ఉదయం 5 గంటల నుండి తనిఖీలు - నార్కోటిక్ డాగ్ రోమా తో గంజాయి పై తనిఖీ - డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**







**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్** ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఉదయం ఐదు గంటల నుండి 100 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువపత్రాలు లేనటువంటి 60 ద్విచక్ర వాహనాలు, 31 ఆటోలు, రెండు ట్రాక్టర్స్ తాత్కాలికంగా స్వాధీనం చేసుకోవడం జరిగింది. అదేవిధంగా నార్కోటిక్ డాగ్ రోమా సహాయంతో గంజాయి కై తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. 16 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. ఇదివరకే నమోదైన రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లను పరిశీలించడం జరుగుతుందని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనని వారిపై ఒక సంవత్సరం పాటు పరిశీలించి రౌడీ షీట్లను, సస్పెక్ట్ షీట్లను ఎత్తివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు యువత వాహనాలలో ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఉండాలని ఎలాంటి గృహహింస చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. రాత్రి సమయాలలో అనవసరంగా తిరగరాదని, ఈవ్‌టీజింగ్ మరియు మహిళలను వేధించడం లాంటివి నిర్వహించకూడదని, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, కె ఫణిదర్, కర్ర స్వామి, ఎస్ఐలు వి విష్ణువర్ధన్, డి రాధిక, మహేందర్, రాకేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిత్రులతో సరదాగా ప్రాజెక్ట్ లో

# బోటు ప్రయాణం



**కడెం, అక్టోబర్ 15,సూర్య మేజర్ న్యూస్ :** నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టును దస్తురాబాద్ తహసిల్దార్ విశ్వంబర్ తన చిన్ననాటి మిత్రులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్టును సందర్శించిన అనంతరం ప్రాజెక్టు వద్ద తెలంగాణ టూరిజం వారు ఏర్పాటు చేసిన బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను తిలకించారు. సహ్యాద్రి కొండల మధ్య కడెం ప్రాజెక్టు రమణీయంగా ఉన్నట్టు వారు పేర్కొన్నారు.

సూర్య
www.suryaa.com

### సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టు పెట్టినందుకు

## యూట్యూబర్ కు 14రోజుల రిమాండ్

**కాగజ్నగర్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని మంగి పాతగూడకు చెందిన యూట్యూబర్ వెంకటేష్‌పై ఆసిఫాబాద్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. తిర్యాని ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం యూట్యూబర్ వెంకటేష్ ఓ సామాజిక వర్గాన్ని అవమానించే



విధంగా సోషల్ మీడియాలో పోస్టు చేయగా, ఆ పోస్టు వైరల్ అయింది. దీనితో ఆ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నాయకులు తిర్యాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా తిర్యాని పోలీసులు యూట్యూబర్ వెంకటేష్‌ను రెబ్బెన సీఐ సంజయ్, తీర్యాని ఎస్.ఐ వెంకటేష్ అరెస్ట్ చేసి విచారణ జరిపారు. అనంతరం నేడు ఆసిఫాబాద్ కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతనికి 14 రోజుల రిమాండ్ కు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికలను సమాజానికి మేలు చేకూర్చే విధంగా వాడుకోవాలి. సామాజిక విభేదాలు రేపే, చట్టాన్ని ఉల్లంఘించే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మంచి కార్యక్రమాలు, ప్రజాసేవా కార్యక్రమాలు చేస్తే పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు.

### జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన

## విద్యార్థినిలు పూర్వా, నితిక్ష

**కాగజ్నగర్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:**
కాగజ్‌నగర్ డిఏవి లక్ష్మీపత్ సింగానియా పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు పూర్వా జి. రవిచందర్, వంగరి నితిక్ష హైదరాబాద్‌లో జరిగిన డిఏవి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో అద్భుత ప్రతిభ చూపారు. యు-14 బాలికల వయస్సు విభాగంలో 32-34 కిలోల 48-50 కిలోల బరువు కేటగిరీలలో పోటీ పడి విజయం సాధించి డిఏవి నేషనల్స్ కు ఎంపికయ్యారు. వీరిని స్కూల్ యాజ



మాన్యం ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్రీడా విభాగం ఇన్‌చార్జ్, అధ్యాపకులు ఈ విద్యార్థినుల ప్రతిభను ప్రశంసించారు.

### కాగజ్నగర్ ఫారెస్ట్ డివిజన్లో సంచరిస్తున్న పులి

## అప్రమత్తంగా ఉండాలంటున్న ఫారెస్ట్ అధికారులు

**కాగజ్నగర్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:**
కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఎర్రవాగు సమీపంలోని తంగళ్లపల్లి, చిన్న తిమ్మాపూర్ గ్రామాల పంట పొలాల్లో పులి అడుగులను గ్రామస్తులు బుధవారం గుర్తించారు. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురై అటవీ అధికారులకు సమాచారం అందించారు. కాగజ్‌నగర్ అటవీ విభాగ అధికారులు పులి కదలికలను గమనిస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.





### కన్నులపండుగగా శోభాయమానంగా కొనసాగిన

## కోరిటికల్ గ్రామం భీమన్న దేవుడి జాతర

**నిర్మల్ ప్రతినిధి, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్**
ఆ ఊరిలో భీమన్న దేవుడి జాతర అంటే చాలు ఆ చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాలలో నివాసంవుంటున్న ప్రజలకు వారి బంధువులకు ఎక్కడలేని ఆనందం ఈ పండగ దసరా పండగ తరువాత వచ్చే రెండవ సోమవారం రోజు జాతర జరుపుకుంటారు.ఈ జాతర మహొత్సవం జరుపుకోవడానికి, ఉత్సవంలో పాలుపంచుకోవడానికి ఉత్సాహంగా పుట్టింటి ఆడబిడ్డలు, అల్లుళు ్ళ, కొడుకులు కోడళ్ళు తమ పిల్లలతో ఎక్కడ ఏ ప్రదేశంలో ఉన్నప్పటికీ ఈ గ్రామం చేరుకొని కొత్తబట్టలు ధరించి పిండివంటలు చేసుకొని విందులు వినోదాలతో సంబరాలు సంబరంగా జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది, ఈ క్రమంలో ముందురోజు అనగా ఆదివారం గజాలు అని పిలువబడే దేవుని రూపాలను దగ్గరలో ఉన్న మునిపల్లి గ్రామశివారులో ఉన్న పవిత్ర గోదావరిస్నానం ఆచరింపజేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి సోమవారం రోజు భక్తులకు దర్శనార్థం భీమన్న ఆలయంలో ఉంచి పూజిస్తారు, భక్తులు వచ్చి కోరికలు చెప్పుకొని వెళ్ళేవారు,తీరిన కోరికలకు చెల్లింపుగా మొక్కులు చెల్లించేవారు హడావిడిగా, డప్పుల కొలహాలంతో కొనసాగేదే ఈ పండగ, ఇది అనాదిగా ఆచారిస్తున్న ఆ గ్రామప్రజల ఆచారం, నమ్మకం. కోరిన కోర్కెలు తీర్చి కొంగుబంగారంగా పిలవబడు ఈ దైవం ఆపదమోక్కులవాడు భీమన్నదేవుడు అని నమ్ముతారు ఈ గ్రామప్రజలు ఎన్నో సంవత్సరాలనుండి మా గ్రామాన్నేకాక చుట్టుపక్కల ప్రజలు భక్తితో స్వామివారిని ధర్శిచుకొని ఆశీర్వాదాలందుకొని కోర్కెలు నెరవేరిన అనంతరం మొక్కులు చెల్లించుకోవడం అనవాయితీగా వస్తోంది.







## విద్యుత్ అధికారుల పొలం బాట

**లక్షెట్టిపేట, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్ :**
సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు బుధవారం మండలంలోని ఉత్కూర్ గ్రామంలో పొలంబాట







నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను విద్యుత్ సిబ్బంది కలిసి వంగిన పోల్స్ సరి చేయడం, ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఎర్తింగు, లూస్ లైన్స్ సరిచేశారు. అనంతరం ఏ డి ఈ ఎం .ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతులు పొలాలలోని మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని దాని ద్వారా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే రైతులు విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని అగ్రికల్చర్‌కు నాణ్యమైన విద్యుత్ అందియడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ గణేష్, నర్సింగరావు, సత్యనారాయణ, రవికుమార్, రాజమౌళి, స్థానిక విద్యుత్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## పులుల గణన పై అటవీ అధికారులకు శిక్షణ

**ఖానాపూర్ టౌన్ అక్టోబర్ 15 సూర్య మేజర్ న్యూస్**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ఏఎంకె ఫంక్షన్ హాల్ లో ఫారెస్ట్ అధికారులకు పులుల గణనపై శిక్షణ కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో భాగంగా అటవీ అధికారులను ఖానాపూర్ రేంజ్ లోని మస్కాపూర్ బీట్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి ప్రత్యక్ష శిక్షణ ఇచ్చినారు. పులుల గణనను ఎలా చేయాలో వారికి వివరించినారు. ఈ గణన కార్యక్రమంను ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తామని, గతంలో 2022లో నిర్వహించినామని, ప్రస్తుత పులుల గణన జనవరి 2026 లో ప్రారంభమై మే 2026 వరకు కొనసాగుతుందని డిఎఫ్ఓ నాగిని భాను



పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎఫ్‌డిఓ శివకుమార్, ఖానాపూర్ ఎఫ్‌ఆర్ఓ కిరణ్ కుమార్, పెంబి ఎఫ్ ఆర్ ఓ రమేష్ రావు, కడెం ఎఫ్ ఆర్ ఓ గీతా రాణి, ఉడుంపూర్ ఎఫ్‌ఆర్ఓ అనిత, దిమ్మదుర్తి ఎఫ్‌ఆర్ఓ శ్రీనివాస్, మామడ ఎఫ్‌ఆర్ అవినాష్ రాథోడ్, బైంసా ఎఫ్‌ఆర్ఓ రాథోర్ రమేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లతోపాటు, ఖానాపూర్ సెక్షన్ ఆఫీసర్ ఏ రవీందర్, ఆయా మండలాల సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు సుమారు 160 మంది ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

### సిఎంపిఎఫ్ సంబంధిత "ప్రయాస్" కార్యక్రమం

## -జీరో పెండెన్సీ లక్ష్యంగా సమావేశం

**శ్రీరాంపూర్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్:**
శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫెరెన్స్ హాల్ నందు సామాజిక భద్రత వినియోగాన్ని హామీగా కల్పించేందుకు సింగరేణి సంస్థలో సిఎంపిఎఫ్ (కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్) ఆధ్వర్యంలో 3వ ప్రయాస్ కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భవిష్యనిధి (ప్రయాస్) పెన్షన్ దావాలను తక్షణ పరిష్కారానికి సంబంధించి చురుకైన చర్యలు తీసుకోవడం ద్వారా "జీరో పెండెన్సీ" సాధించడం ముఖ్య లక్ష్యంగా ఈ సమావేశము నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంతో డీజీఎం పర్సనల్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో



నిర్వహించటం జరిగింది. సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ 1 (రామగుండం) శ్రీహరి పచౌరి సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ 2 (రామగుండం) కె గోవర్ధన్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 588 రివైజ్డ్ పెన్షన్స్ పేమెంట్ ఆర్డర్ కాపీలను అందజేయడం జరిగింది. సింగరేణి ఉద్యోగులకు సంభంధించిన సిఎంపిఎఫ్ నంబర్ అలాట్ మెంట్, పదవి విరమణ పొందిన ఉద్యోగుల క్లయిమ్స్ ను త్వరితగతిన పూర్తి చేయాలని డీజీఎం పర్సనల్ అనిల్ కుమార్ కోరారు. సింగరేణి ఉద్యోగులకు ఎలాంటి జాప్యం లేకుండా (సీఎంపిఎఫ్) కోల్ మైండ్స్ ప్రావిడెంట్ ఫండ్ ను త్వరితగతిన చెల్లించడానికి కృషి చేయనున్నట్లు 1 (రామగుండం) శ్రీహరి పచౌరి తెలిపారు. సిఎంపిఎఫ్ పెన్షన్ సంబంధించిన లావాదేవీలను సిబికేర్స్ పోర్టల్ ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సిఎంపిఎఫ్ కు సంబంధించిన పెండింగ్ వెన్సన్ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా సీఎం పీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చునని తెలిపారు. ఈ సమావేశములో ఉద్యోగులకు సంభంధించిన సిఎంపిఎఫ్ సమస్యలపైన సి కేర్స్ పోర్టల్ ద్వారా పరిష్కరించే విధానలను సిఎంపిఎఫ్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైద, సీనియర్ పిఓ పి. కాంతారావు, అకౌంట్స్ అధికారి పద్మా, సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది, గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న

### - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడి గొండ అక్టోబర్. సూర్య మేజర్ న్యూస్**
హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రసారంలో మాగంటి సునీత గోపీనాథ్ ఎన్నికలలో గెలుపు కొరకు భాగంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయన బోథ్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు దేవేందర్‌రెడ్డి, ముందే పాడ్‌రంగ్, ముఖ్య మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, సురేందర్, సాయిరామ్ అబిరెడ్డి ఈ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తో పాటు పాల్గొన్నారు.



సూర్య www.suryaa.com

### గ్రామీణ సమాజ అభివృద్ధిలో

# మహిళల కృషిని ప్రభుత్వాలు గుర్తించాలి

## తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ రాజలింగు మోతే

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్**

గ్రామీణ సమాజ అభివృద్ధిలో మహిళల కృషిని ప్రభుత్వాలు గుర్తించాలని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతే అన్నారు. బుధవారం అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన



మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళల కృషి అపూర్వమని, వారి కృషిని ప్రభుత్వాలు గుర్తించి, వారి హక్కులను రక్షించాలన్నారు. ప్రభుత్వాలు వారికి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలను కల్పించాలని ఆయన అన్నారు.అనేక కీలక రంగాల్లో మహిళలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కృషికి తగిన గుర్తింపు లేకుండా, గ్రామీణ మహిళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యా అవకాశాల కొరత, ఆరోగ్య సౌకర్యాల లోపం, ఆస్తి హక్కుల నుండి వంచన, పేదరికం, బాల్య వివాహాలు, లైంగిక వివక్ష, శ్రమను గుర్తించక పోవడం వంటి సమస్యలతో గ్రామీణ మహిళలు నేటికీ సతమత మవుతున్నారని అన్నారు. కనుక ప్రభుత్వాలు, పాలకులు, స్వచ్ఛంద సంస్థలు, సమాజం మహిళల సమస్యల పరిష్కారానికి కలిసి పని చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ మహిళల అభ్యున్నతికి తమవంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో టీబీఎస్ఎస్ నాయకులు సయ్యద్ యూసఫ్, మండల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ ఆసుపత్రికి ఆర్ఎంఓ గా నియమితులైన డాక్టర్ చింతపండు రవికుమార్ కు ఘనసన్మానం

**నిర్మల్ అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్**

ఇటీవల పదోన్నతి పొంది నిర్మల్ జనరల్ ఆసుపత్రికి ఆర్ఎంఓ గా



నియమితులైన డాక్టర్ చింతపండు రవికుమార్ ను బుధవారం జిల్లా ఫిజీషియన్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దామెర రాములు, జిల్లా ఫిజీషియన్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ముఖేష్, కార్యదర్శి డాక్టర్ రవికుమార్, కోశాధికారి డాక్టర్ రనీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి

# నిర్మూలన టీకాల కార్యక్రమం

## గోడప్రతుల ఆవిష్కరన కార్యక్రమం

**నిర్మల్ ప్రతినిధి, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్**

జిల్లాలో పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకాల కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 15వ తేదీ నుండి నెల రోజులపాటు జిల్లాలోని అన్ని మండలాల్లో గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాల కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పశువులకు ఉచితంగా టీకాలు వేసి వ్యాధి వ్యాప్తిని అరికట్టడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక పశువైద్య బృందాలు ఏర్పాటుచేసి ఇంటింటికీ తిరిగి పశువులకు టీకాలు అందించాలని, ఈ కార్యక్రమం ఎక్కడా లోటుపాట్లకు తావు లేకుండా సమన్వయంతో అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు, పశు యజమానులు ఈ కార్యక్రమానికి చురుకుగా సహకరించాలని, టీకాలు వేయించుకోవడంలో నిర్లక్ష్యం వహించరాదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్, సహాయ పశువైద్యాధికారి బాలిక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



# ఎంపిడివో ఆధ్వర్యంలో...సమీక్ష సమావేశం

**భీమిని, అక్టోబరు15, సూర్య మేజర్ న్యూస్:**

మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో బుధవారం ఎంపీడీవో బి. గంగా మోహన్ అధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పలు పథకాలను ముందుకు తీసుకొని వెళ్లెందుకు చర్చించారు. సమీక్షలోని వివరాలు మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఎవరైనా పేదరికంతో ఇల్లు ప్రారంభించని స్థితిలో ఉన్న వాళ్ళకి ఐకెపి ద్వారా రుణం మంజూరు చేయడానికి వారి పేర్లు వెంటనే ఇవ్వవలసిందిగా ఆదేశించడం జరిగింది, అదేవిధంగా2026–27సంవత్సరానికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామసభల ద్వారా నూతన పనులు గుర్తించి ఎస్టిమేషన్స్‌ని సిద్ధం చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది, ఇంకా నర్సరీలను వెంటనే శుభ్రం చేయించి వాటిలో బ్యాగ్ ఫిల్లింగ్ ప్రక్రియను ప్రారంభించాలని సూచించడం జరిగింది. అదేవిధంగా గతంలో పెండింగ్లో ఉన్నటువంటి అన్ని రకాల పేమెంట్స్ వెంటనే చేయించవలసిందిగా చెప్పడం జరిగింది. అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం, త్రాగునీరు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పంచాయతి కార్యదర్శులను ఆదేశించడం జరిగింది. ఈ సమావేశంలో ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ రాజేంద్రప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



### భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన

# మహనీయుడు డా అబ్దుల్ కలాం

**దస్తురాబాద్, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్**

మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల పెర్కపల్లిలో డా అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి గంగాధర్ మాట్లాడుతూ అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడం అంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి




ఎనలేని సేవలు అందించారు. ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన.. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకున్నారు అని కొనియాడారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శం. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించిన ఆయన అసలైన భారత రత్నం. రాష్ట్రపతిగా ఎదిగిన కలామ్.. అత్యున్నత పదవిలోనూ నిరాండబరమైన జీవితాన్ని గడిపారు. 1931లో జన్మించిన కలాం.. రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చారు. పదవీ కాలం పూర్తయ్యాక విశ్రాంతి తీసుకోకుండా.. తనకు ఇష్టమైన బోధన పట్ల మక్కువ చూపారు. ఐఐఎం షిల్లాంగ్‌లో అధ్యాపకుడిగా చేరారు. కలాం జీవితం మొత్తం విశ్రాంతి లేకుండా పని చేశారు. తొలి విజయం సాధించాక ఆగిపోకండి.. మొదటిసారి గెలిచి, రెండోసారి ఓడితే.. తొలి విజయం అదృష్టవశాత్తూ వచ్చిందంటారు.. అని యువతకు కలాం సందేశాన్నిచ్చారు. కలలు కనండి.. ఆ కలలను సాకారం చేసుకోవడానికి నిరంతరం శ్రమించడని కలాం చెప్పిన సూక్తి యువతకు ఆదర్శం. మనిషికి కష్టాలు ఎంతో అవసరం.. కష్టాలను జయిస్తేనే మనిషి మహోన్నత వ్యక్తిగా ఎదుగుతారని పేర్కొన్నారు. 1970–90 మధ్య పీఎస్ఎల్వీ రూపకల్పన కోసం శ్రమించారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా.. అగ్ని, పృథ్వీ మిస్సైళ్ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత కలాందే. అందుకే ఆయన్ను "మిస్సైల్ మాన్" అని పిలుస్తారని పిల్లలకు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుంగూరి వెంకట్రాజం, సి ఆర్ పి. తిరుపతి ఉపాధ్యాయురాలు రాధిక విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ బస్ కింద పడి వృద్ధురాలి మృతి

**సారంగాపూర్,అక్టోబర్ 15,సూర్య మేజర్ న్యూస్**



మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ స్కూలుకు సంబంధించిన బస్సు కిందపడి మండల కేంద్రానికి చెందిన దేవి సాయమ్మ (80) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ జాదవ్ అంకుష్ స్కూల్ విద్యార్థులను దించి వెనక్కి తీసుకునే క్రమంలో ఇంటి ముందు నిలబడి ఉన్న వృద్ధురాలిని గమనించకపోవడంతో బస్సు కింద పడి తీవ్ర గాయాలయ్యాయని, వెంటనే స్పందించిన స్థానికులు కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించినప్పటికీ తీవ్ర గాయాలవడంతో అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.ఇట్టి ప్రమాదానికి కారకులైన బస్సు డ్రైవర్ పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

### చోరీకి యత్నించిన దొంగలను పట్టుకున్న

# సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది

**మందమర్రి, అక్టోబర్ 15, సూర్య మేజర్ న్యూస్**

ఏరియాలోని కే.కే ఓసి స్టోర్ ప్రాంగణంలో దొంగతనానికి యత్నించిన ఇద్దరు వ్యక్తులను సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో కే.కే ఓసి స్టోర్‌లో ముగ్గురు వ్యక్తులు చొరబడి దొంగతనం చేసేందుకు




ప్రయత్నించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఎం.టి.ఎఫ్ సెక్యూరిటీ గార్డ్ పి సదానందం వారిని గమనించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తెలుపగా అప్రమత్తమైన ఎంటీఎఫ్ టీం హుటా హుటిన ఘటన స్థలానికి చేసుకుని స్టోర్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో వెతకగా యార్డ్ లోపల దొంగతనానికి వచ్చిన ముగ్గురిలో ఒకరు పారిపోగా ఇద్దరు దొంగలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. తదనంతరం దొంగలను ఎస్ అండ్ పిసి కంట్రోల్ రూమ్ కు తరలించారు. దొంగతనానికి వచ్చి దొరికిన ఇద్దరిని బుధవారం మందమర్రి పోలీస్ స్టేషన్లో అప్పగించారు. పట్టుబడిన వ్యక్తులకు ఇంతకు ముందు జరిగిన



దొంగతనాలలో ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ అండ్ పిసి సిబ్బందిని, ఎం.టి.ఎఫ్ సిబ్బందిని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అభినందించారు.

### తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పాఠశాలకు

## లక్ష రూపాయల విలువ చేసే వస్తువుల అందజేత

**సారంగాపూర్,అక్టోబర్ 15,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని జామ్ ప్రభుత్వ ఉన్నత,ప్రాథమిక పాఠశాలలకు లక్ష రూపాయల విలువ చేసే సామాగ్రిని రోటరీ క్లబ్ ఆఫ్ చేంజ్ మేకర్స్ ఆధ్వర్యంలో ఏలేటి నరసింహారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె లావణ్య దేవేందర్ రెడ్డి బుధవారం రోజు అందజేశారు. దాదాపుగా లక్ష రూపాయల విలువ చేసే మైక్ సెట్, కార్పెట్స్, నోటీస్ బోర్డ్స్, గ్లోబ్, చెస్ బోర్డ్స్, వాలీబాల్స్, ప్రపంచ పటాలు, విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్స్, ప్లేట్లు, గ్లాసులు, తదితర వస్తువులను అందజేసినట్లు వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను అందించే ఉద్దేశంతో వీటిని అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, విజయ్ కుమార్, రోటరీ క్లబ్ ఆఫ్ చేంజ్ మేకర్స్ హైదరాబాద్ అధ్యక్షులు యోగేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ ఉప సర్పంచ్ కరిపే విలాస్ తదితరులు పాల్గొన్నారు.

